సాక్షి
పశ్చిమగోదావరి



గురువారం । 2 । అక్టోబర్ । 2025

వైద్య సేవలకు సుస్తీ

- సమ్మెలో రూరల్ పీహెచ్‌సీ వైద్యులు
- వైద్యుల సర్దుబాటులో అధికారులు
- పలుచోట్ల విధుల్లోకి చేరని వైద్యులు
- సేవల కోసం రోగుల పడిగాపులు



భీమవరం ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యం కోసం వేచి ఉన్న ప్రజలు

సాక్షి, భీమవరం: డిమాండ్ల సాధనకు రూరల్ పీహెచ్‌సీ వైద్యులు చేపట్టిన సమ్మె నాలుగో రోజుకు చేరింది. ఓపీ విధులు, స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ వైద్య శిబిరాలకు దూరంగా ఉన్న వైద్యులు అత్యవసర సేవలను బహిష్కరించారు. జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులు పలు పీహెచ్‌సీల్లో వైద్యులను సర్దుబాటు చేసినా పలుచోట్ల రోగులకు ఇబ్బందులు తప్పలేదు. సర్వీస్‌లోని పీహెచ్‌సీ వైద్యులకు పీజీ కోటాలో సీట్లు పునరుద్ధరించాలని, టైం బాండ్ పదోన్నతులు కల్పించాలని, గిరిజన ప్రాంతాల్లో పనిచేసేవారికి బేసిక్‌పై 50 శాతం అలవెన్స్ ఇవ్వాలని, కౌన్సెలింగ్ విషయంలో అర్బన్ అండ్ నేటివిటీపై ఆరేళ్ల గడువును ఐదు సంవత్సరాల కుదించడం, నేటివిటీపై స్పష్టత కావాలని, చంద్రన్న సంచార చికిత్స కార్యక్రమానికి రూ.5000 అలవెన్స్ ఇవ్వాలని తదితర డిమాండ్లతో ఏపీ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్ అసోసియేషన్ (ఏపీపీహెచ్‌సీడీఏ) ఆందోళన చేపట్టిన విషయం విదితమే. జిల్లాలో 34 రూరల్ పీహెచ్‌సీల పరిధిలో దాదాపు 74 మంది వైద్యులు సేవలందిస్తున్నారు. అసోసియేషన్ పిలుపు మేరకు సోమవారం ఓపీ విధులు, స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ వైద్య శిబిరాలను బహిష్కరించి పోరుబాట పట్టారు.

27 మంది వైద్యుల సర్దుబాటు

రూరల్ పీహెచ్‌సీ వైద్యులు విధులను బహిష్కరించడంతో ప్రజలకు వైద్యసేవలు అందించేందుకు ఏరియా ఆస్పత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల నుంచి 27 మంది వైద్యులను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సర్దుబాటు చేశారు. వీరిలో తణుకు జిల్లా ఆస్పత్రి నుంచి ఆరుగురు, భీమవరం ప్రభుత్వ ఆస్పత్రి నుంచి ఐదుగురు, తాడేపల్లిగూడెం నుంచి ముగ్గురు, పాలకొల్లు నుంచి నలుగురు, నరసాపురం నుంచి నలుగురు, ఆకివీడు నుంచి ఒకరికి, ఇతర ఆస్పత్రుల నుంచి మరో నలుగురికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.



ఉండిలో వైద్య సేవల కోసం వేచి ఉన్న మహిళలు



వెంకటరామన్నగూడెంలో మూసి ఉన్న వైద్యుడి గది

రోగులకు ఇక్కట్లు

ఆస్పత్రుల్లో పూర్తిస్థాయిలో వైద్యులు లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఏరియా ఆస్పత్రులు, సీహెచ్‌సీలో రోజువారి ఓపీ 200 నుంచి 400కు పైగా ఉంటుంది. వీటిలో జనరల్ కేసులు ఎక్కువగా ఉంటాయి. సాధారణంగా జనరల్ కేసులు ఎక్కువగా ఎంబీబీఎస్ కేడర్ వైద్యులు చూస్తుంటారు. వీరిలో చాలామంది రూరల్ పీహెచ్‌సీలకు ఇన్‌చార్జిలుగా వెళ్లడంతో వైద్య సేవల కోసం రోగులు గంటల తరబడి వేచిఉండాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. మిగిలిన వైద్యులపై పనిభారం పడుతోందంటున్నారు. మరోపక్క కొన్నిచోట్ల ఇన్‌చార్జి వైద్యులు విధుల్లో చేరక రూరల్ పీహెచ్‌సీల్లోనూ సేవల కోసం రోగులకు అవస్థలు తప్పలేదు. తాడేపల్లిగూడెం రూరల్ వెంకటరామన్నగూడెం, మాధవరం పీహెచ్‌సీలకు ఇన్‌చార్జి వైద్యులను నియమించినా వారు జాయిన్‌కాకపోవడంతో వైద్యసిబ్బంది రోగులకు మందులు ఇచ్చి పంపారు. రూరల్ పీహెచ్‌సీ వైద్యుల డిమాండ్లపై ప్రభుత్వం ఇంకా సానుకూలంగా స్పందించకపోవడంతో ఆందోళన ఎన్నిరోజులు కొనసాగుతుందో తెలీని పరిస్థితి. అప్పటి వరకు వైద్యసేవల కోసం ఇబ్బందులు తప్పవని రోగులు వాపోతున్నారు. త్వరితగతిన సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని కోరుతున్నారు.

విశ్వ వినోదిని.. విష్ణు విలాసిని



శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా భీమవరం పట్టణ ఇలవేల్పు మావుళ్లమ్మవారు బుధవారం మహిషాసురమర్దనీగా భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. - భీమవరం (ప్రకాశం చౌక్)

న్యూస్‌రీల్

కాంట్రాక్టు పారిశుద్ధ్య కార్మికుల ఆందోళన



ప్రభుత్వాసుపత్రి వద్ద ఆందోళన చేస్తున్న దృశ్యం

భీమవరం: భీమవరం ప్రభుత్వాసుపత్రిలో పని చేస్తున్న కాంట్రాక్టు పారిశుద్ధ్య కార్మికుల వేతన బకాయిలు, పీఎఫ్ బకాయిలను తక్షణమే చెల్లించాలని, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి చెల్లబోయిన రంగారావు డిమాండ్ చేశారు. బుధవారం ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రభుత్వాసుపత్రి, తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించిన సందర్భంగా చెల్లబోయిన మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులకు ఇస్తున్న వేతనాలు అతి తక్కువగా ఉన్నా ప్రతినెలా సక్రమంగా ఇవ్వకపోవడం వల్ల ఆర్థిక ఇబ్బందులతో విధులు నిర్వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పీఎఫ్ సొమ్ము సైతం కార్మికుల పీఎఫ్ ఖాతాలకు జమ చేయడం లేదని ఆసుపత్రి పడకల స్థాయికి అనుగుణంగా పారిశుద్ధ్య కార్మికులు లేక తీవ్ర పనిభారంతో అనారోగ్యం పాలవుతున్నారన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఎంప్లాయిస్ అండ్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

టైమ్ బౌండ్ ప్రమోషన్ అమలు చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న వైద్యాధికారులు

భీమవరం(ప్రకాశం చౌక్): టైమ్ బౌండ్ ప్రమోషన్లు పొరుగు రాష్ట్రాలన్నింటిలో నిరంతరం అమలు జరుగుతున్న హక్కును రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్స్ అసోసియేషన్(ఏపీపీహెచ్‌సీడీఏ) ఆధ్వర్యంలో భీమవరం కలెక్టరేట్‌లోని డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయం ఎదుట వైద్యాధికారులు బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. వైద్యాధికారులు ఆర్థిక ప్రయోజనాలు కాకుండా మానవ వనరుల పరంగా టైమ్ బౌండ్ ప్రమోషన్లు తమ న్యాయమైన హక్కు అని డిమాండ్ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు కరోనా మహమ్మారి సమయంలో తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి, ప్రజల ప్రాణాలను రక్షించినప్పటికీ, ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల వారి హక్కులు సంవత్సరాలుగా అమలు కావడం లేదని వారు గుర్తు చేశారు. ఇప్పటికే పలు సార్లు ఉన్నతాధికారులు, ముఖ్యమంత్రిని కలిసి విన్నవించుకున్నా సమస్య పరిష్కారం కానందున ఈ నిరసన చేపడుతున్నామన్నారు.

వరదను సమర్థంగా ఎదుర్కొంటాం



కనకాయలంక కాజ్ వే వద్ద గ్రామస్తులతో మాట్లాడుతున్న ఆర్డీఓ దాసి రాజు

యలమంచిలి: గోదావరి వరదను సమర్థంగా ఎదుర్కొంటామని నరసాపురం ఆర్డీఓ దాసి రాజు చెప్పారు. గోదావరి ఉధృతి నేపథ్యంలో కనకాయలంక కాజ్ వే మునిగిపోవడంతో బుధవారం ఆయన అధికారులతో కలసి వరద తీవ్రతను పరిశీలించారు. అనంతరం స్థానికులతో మాట్లాడుతూ ప్రజలకు తాగునీరు ప్యాకెట్లు సరఫరా చేస్తున్నట్లు వివరించారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి ఇబ్బందికర పరిస్థితులు తలెత్తినా వెంటనే పై అధికారులకు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ గ్రంధి పవన్ కుమార్, ఎస్సై కర్రిడి గురయ్య, వీఆర్వోలు ఉన్నారు.

మీటర్ రీడర్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించాలి

ఏలూరు (టూటౌన్): విద్యుత్ మీటర్ రీడర్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించి, విద్యుత్ సంస్థలోని నియామకాలు చేపట్టాలని ఏపీ విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఏలూరు స్ఫూర్తి భవనంలో విద్యుత్ మీటర్ రీడర్స్ జిల్లా సమావేశం బుధవారం జరిగింది. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే, ఏఐటీయూసీ జిల్లా నాయకులు పి.కిషోర్, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఉపాధ్యక్షుడు పి.జాకబ్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కే శేఖర్, జిల్లా కోశాధికారి కే మల్లేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో గత 20 ఏళ్లుగా విద్యుత్ మీటర్ రీడర్స్ విద్యుత్ సంస్థలో పనిచేస్తున్నారని అన్నారు. స్మార్ట్ మీటర్లను తీసుకొస్తున్న నేపథ్యంలో మీటర్ రీడర్స్ ఉపాధి ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణ మీటర్ రీడర్స్‌కు ప్రత్యామ్నాయంగా ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు.

జీఎస్టీ తగ్గింపుతో ఆర్థిక వెసులుబాటు



అలమూరులో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

పెనుమంట్ర: జీఎస్టీ తగ్గింపులో మార్పులు తీసుకురావడం వల్ల రైతులు సామాన్య ప్రజలకు పెద్ద ఎత్తున ఆర్థిక వెసులుబాటు కలుగుతోందని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్ పేరుతో బుధవారం పెనుమంట్ర మండలంలోని ఆలమూరు సచివాలయ ఆవరణలో జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వ్యవసాయ యంత్ర పరికరాల ఎగ్జిబిషన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జీఎస్టీ సంస్కరణల అమలులో భాగంగా గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. జీఎస్టీ సంస్కరణల వల్ల ప్రయోజనాల గురించి ప్రతి ఒక్కరికి తెలిసేలా కరపత్రాల పంపిణీతో పాటు ర్యాలీలు, ఎగ్జిబిషన్ , వర్క్ షాపులు నిర్వహించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

రెడ్‌బుక్ రాజ్యాంగానికి వత్తాసు

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు డీఎన్నార్‌పై కేసు
- అసెంబ్లీలో కూటమి నేతల అనుచిత వ్యాఖ్యలపై చర్యలేవీ ?

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లాలో కూటమి నేతల రెడ్‌బుక్ రాజ్యాంగంలో పోలీసులు తమవంతు పాత్ర పోషిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షులు దూలం నాగేశ్వరరావుపై ఏలూరు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. పోలీస్ అధికారుల సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, ఏఎస్‌ఐ బండారు యేసు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేశారు. కూటమి నేతల ఒత్తిడితో పోలీస్ అధికారులు రెడ్‌బుక్ రాజ్యాంగానికి వత్తాసు పలుకుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతిపక్ష పార్టీల నేతలను అక్రమ కేసులతో భయభ్రాంతులకు గురిచేయాలనే ఉద్దేశ్యంతో కక్షపూరిత రాజకీయాలకు ప్రభుత్వం తెరతీసిందని అంటున్నారు. గతంలో మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి ఇంటివద్దనే టీడీపీ నేతలు, రౌడీలు అరాచకం సృష్టించగా.. కేసులు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై పెడుతూ వేధింపులకు గురిచేశారు. తాజాగా దూలం నాగేశ్వరరావుపైనా అక్రమ కేసు నమోదు చేసి కుట్రపూరిత రాజకీయాలకు తెరతీశారు.

రాజకీయ విమర్శలపై కేసులా

ఏపీ అసెంబ్లీలో కై కలూరు ఎమ్మెల్యే కామినేని చేసిన అసందర్భ వ్యాఖ్యలతో రాజకీయ విమర్శలు ప్రారంభం అయ్యాయి. ఈ నేపథ్యంలో ప్రెస్‌మీట్‌లో కైకలూరు ఎమ్మెల్యే అవినీతి, అక్రమాలపై దూలం నాగేశ్వరరావు విరుచుకుపడ్డారు. ఇదే సందర్భంలో కై కలూరు రూరల్ సీఐ రవికుమార్‌పైనా పలు విమర్శలు, ఆరోపణలు చేశారు. దీనికి కౌంటర్‌గా పోలీస్ అధికారుల సంఘం నేతలు, ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు ప్రెస్‌మీట్ పెట్టారు. ఏఎస్పీ మాట్లాడుతూ... ఒక మాజీ ఎమ్మెల్యే, ప్రతిపక్ష పార్టీ జిల్లా అధ్యక్షుడిపై 'నోటి దూల తీర్చుతామంటూ' హెచ్చరించటంపైనా తీవ్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

గొంతు నొక్కే ప్రయత్నం



ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ నాయకుల గొంతు నొక్కేందుకే అక్రమ కేసులు బనాయిస్తున్నారు. దూలం నాగేశ్వరరావు విమర్శలపై కేసులు పెట్టిన పోలీసులు, టీడీపీ నేతలు, ప్రజాప్రతినిధుల ఒత్తిడితోనే డ్యూటీలు చేయటం నిజం కాదా!. పోలీసులు చట్టానికి లోబడి విధులు నిర్వర్తించాలి తప్పా... రాజకీయ నేతల ఒత్తిడులతో కాదు. అసెంబ్లీ సాక్షిగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సైకో అంటూ చేసిన వ్యాఖ్యలపై చర్యలు తీసుకున్నారా?. కూటమి నేతల చేస్తోన్న కుట్ర రాజకీయాలకు ప్రజలే తగిన సమయంలో బుద్ధి చెబుతారు.

– కంభం విజయరాజు, చింతలపూడి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త

రాజకీయ విమర్శలపై కేసులా..



కూటమి నేతలు ప్రతి రోజూ ఇష్టారాజ్యంగా రాజకీయ విమర్శలు, ఆరోపణలు చేస్తున్నారు. వారిపై కేసులు పెడతారా?. నిష్పక్షపాతంగా చట్టాన్ని అమలు చేయాల్సిన బాధ్యత పోలీస్ అధికారులపై ఉంది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై ఇష్టారాజ్యంగా అసభ్యపదజాలంతో దూషిస్తోన్న వారిపై కేసులు ఎందుకు పెట్టడం లేదు. పోలీస్ అధికారులు రాజకీయ నేతల ఒత్తిడులతో అక్రమ కేసులు పెట్టటం సరికాదు. ప్రతిపక్ష పార్టీల నేతలు, కార్యకర్తలను బెదిరించేలా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోంది.

–మామిళ్ళపల్లి జయప్రకాష్, ఏలూరు సమన్వయకర్త

వృద్ధులకు న్యాయ సహాయం



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ జిల్లా కార్యదర్శి రత్నప్రసాద్

ఏలూరు (టూటౌన్): నేటి సమాజంలో నిరాశ్రయులైన వృద్ధుల సంఖ్య నానాటికీ పెరిగిపోతుందని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అన్నారు. ఏలూరులోని పట్టణ నిరాశ్రయుల వృద్ధుల ఆశ్రమాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సును నిర్వహించారు. చట్టపరంగా సీనియర్ సిటిజెన్స్‌కు ఉన్న హక్కులు, చట్టాలపై అవగాహన కలిగించారు. వృద్ధులకు అవసరమైన న్యాయ సహాయాన్ని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఉచితంగా అందిస్తుందని, ఉచిత న్యాయ సలహాలకు 15100 నెంబరులో సంప్రదించవచ్చని తెలిపారు.

ఆంధ్రా మైసూర్ ముస్తాబు

- నూజివీడులో నేడు దసరా ఉత్సవాలు
- కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు



కోటమహిషాసుర మర్దని ఆలయం లోపల విద్యుత్ దీపాల ధగధగలు



ఉత్సవాలకు సిద్ధంగా ఉన్న బుట్టబొమ్మలు



ఐరావతం

నూజివీడు: జమీందారుల ఏలుబడిలో దసరా ఉత్సవాల నిర్వహణలో రెండో మైసూర్‌గా నూజివీడు పేరొందింది. గత నెల 22 నుంచి నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయి. గురువారం రాత్రి జరిగే ఉత్సవాలను తిలకించడానికి ప్రజలు భారీగా తరలిరానున్నారు. రాచరికపు కోటలకు నిలయంగా ఉన్న నూజివీడును శత్రువుల బారి నుంచి పరిరక్షించి, ప్రజలందరినీ చల్లగా చూసేందుకు జమిందారులు కోటప్రాకారంలో నిర్మించిన మహిషాసుర మర్దని అమ్మవారి ఆలయం దసరా ఉత్సవాలకు ముస్తాబైంది. కోట ప్రాకారంలో ఉండటంతో కోట మహిషాసురమర్దని ఆలయంగా ప్రసిద్ధికెక్కింది. దసరా ఉత్సవాల్లో భాగంగా విజయదశమి రోజున రాత్రి గరుడ వాహనం, ఐరావతం, బుట్టబొమ్మలు, కోలాట నృత్య ప్రదర్శనలు, చిత్ర, విచిత్ర వేషధారణలతో జోరుగా హుషారుగా ఉత్సవాలు సాగనున్నాయి. స్థానిక ఉయ్యూరు ఎస్టేట్ వద్ద జమిందారీ వారసులు జమ్మికొట్టి దసరా ఉత్సవాలను ప్రారంభించనున్నారు. అక్కడ నుంచి ప్రారంభమయ్యే ఊరేగింపు రాత్రంతా పురవీధుల్లో తిరుగుతూ ప్రజల్ని రంజింపచేస్తుంది. శ్రీ కోట మహిషాసురమర్దని అమ్మవారి ఆలయంలో పోలీసు అధికారులతో ఆయుధ పూజ నిర్వహించిన అనంతరం రాత్రి 10 గంటల నుంచి అమ్మవారు హంస వాహనంపై గ్రామోత్సవానికి బయలుదేరతారు. ఈ గ్రామోత్సవంలో గరగ నృత్యం, బేతాళ సెట్టు, కర్రల మీద మనుషుల నడక, శక్తివేషాలు, కోలాటం, కత్తిసాము, కర్రసాము, నారసాల వంటి ప్రదర్శనలను ఏర్పాటు చేశారు. ఉత్సవాలను పురస్కరించుకొని పట్టణంలో చిన్నగాంధీబొమ్మ సెంటర్ వద్ద నుంచి పెద్ద గాంధీబొమ్మ సెంటర్ వరకు బొమ్మల దుకాణాలు వెలిశాయి. స్థానిక హనుమాన్ జంక్షన్ రోడ్డులో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ చిన్నారుల్ని విశేషంగా ఆకర్షిస్తోంది.

దసరా ఉత్సవాలకు ఉయ్యూరు రాజా నాంది

112 ఏళ్ల క్రితం నూజివీడులో దసరా ఉత్సవాలకు ఉయ్యూరు ఎస్టేట్ రాజా శ్రీకారం చుట్టినట్లు చరిత్ర చెబుతోంది. ఉయ్యూరు ఎస్టేట్ సంస్థానాధీశులైన రాజా రంగయ్యప్పారావువారి సంస్థాన ద్వారం గుర్రాల గేటు వద్ద ఉన్న ఆయుధాగారంలోని ఆయుధాలకు ఎస్టేట్‌లోని జమ్మిచెట్టు వద్ద పూజ చేసి దసరా ఉత్సవాన్ని ప్రారంభించే ఆనవాయితీ నాటి నుంచి నేటి వరకూ వస్తోంది. ఉయ్యూరు రాజా హయాంలో అన్ని ఎస్టేట్లకు చెందిన ఏనుగులు అంబారీ, ఒంటెలు, గుర్రపు స్వారీలతో పెద్ద ఊరేగింపు జరిగేది. కోలాటాలు, కత్తి సాము, గారడీలతో ఎంతో ఉత్సాహ పూరితమైన వాతావరణంలో ఉత్సవాలు జరిగేవి. అమ్మవారితో పాటు శ్రీ వేంకటేశ్వరస్వామి, కోట శివాలయం, రాజగోపాలస్వామి ఉత్సవ మూర్తులను గ్రామోత్సవం నిర్వహించేవారు. రాజా రంగయ్యప్పారావు తదనంతరం రాజా వెంకటాద్రి అప్పారావు మైసూర్ మహారాజా ఆధ్వర్యంలో జరిగే దసరా ఉత్సవాలను మైసూర్ వెళ్లి తిలకించారు. అక్కడి ఉత్సవాల్లో బుట్టబొమ్మలను చూసి మంత్రముగ్ధుడైన ఆయన ఆ తరహాలోనే బుట్టబొమ్మలను ప్రత్యేకంగా తయారు చేయించి నూజివీడులో జరిగే ఉత్సవాల్లో ప్రదర్శింపజేయడం ఆనవాయితీగా మారింది. ఈ ఉత్సవాల్లో బుట్టబొమ్మలు ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నాయి. రాజా మేకా వెంకటాద్రి అప్పారావు 1952లో ఈ దసరా ఉత్సవాల బాధ్యతను స్థానిక పెద్దలకు అప్పగించారు. దీంతో అప్పటి నుంచి పుర ప్రముఖులు స్పోర్టింగ్ క్లబ్ పేరుతో దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు.

భారీ పోలీస్ బందోబస్తు

ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పెద్ద ఎత్తున పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. 200 మందిని బందోబస్తు విధులకు నియమించారు. ఆలయంలో తోపులాట చోటుచేసుకోకుండా క్యూలైన్‌ల వద్ద పోలీసు సిబ్బందితో పాటు ఎన్‌సీసీ క్యాడెట్లను, ట్రిపుల్ ఐటీ సెక్యూరిటీ సిబ్బందిని ఏర్పాటు చేశారు. గురువారం సాయంత్రం 6 గంటల నుంచి శుక్రవారం ఉదయం 7 గంటల వరకూ లారీలు, భారీ వాహనాలను పట్టణంలోకి రాకుండా పోలీసు అధికారులు ఏర్పాట్లు చేశారు.

పింఛన్ల పంపిణీ



పింఛన్ల పంపిణీ చేస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం(ప్రకాశం చౌక్): ఆర్థిక ఆసరాగా ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు నిలుస్తున్నాయని, లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. బుధవారం భీమవరం ఆదర్శనగర్ కాత్రేయగుంటలో డీఆర్డీఏ ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో కలెక్టర్ పాల్గొని లబ్ధిదారులకు స్వయంగా పింఛన్లను పంపిణీ చేశారు. ఉదయాన్నే కాత్రేయగుంటకు చేరుకున్న కలెక్టర్ లబ్ధిదారులను పలకరిస్తూ పెన్షన్లు పంపిణీ చేశారు.

ఖైదీల్లో పరివర్తన.. నైపుణ్య శిక్షణ

- నేర ప్రవృత్తి మార్చేందుకు కృషి
- శిక్షానంతరం భవిష్యత్‌కు బాటలు
- జైళ్ల శాఖ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు
- నేడు ఖైదీల సంక్షేమ దినోత్సవం

కఠిన శిక్షలే కాదు... అనేక నేరాలు చేసి వచ్చిన వారిలోనూ సత్ప్రవర్తన తీసుకొచ్చేందుకు తీవ్రంగానే శ్రమిస్తారు. కరుడు కట్టిన నేరస్తులైనా జైలులోకి వచ్చిన తరువాత వారి చేసిన నేరాలు పక్కన పెట్టి వారిలో మార్పు తీసుకొచ్చేందుకు కృషి చేస్తారు. ఏదో క్షణికావేశంలో చేసిన నేరానికి ఖైదీలు జీవితాన్నే కోల్పోవాల్సిన పరిస్థితి. ఆ జీవితాన్ని కోల్పోకుండా శిక్షానంతరం వారి బంగారు భవితకు బాటలను వేస్తున్నారు జైళ్ల శాఖ అధికారులు. నేడు ఖైదీల సంక్షేమ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

ఏలూరు (మెట్రో) : సీసీసీ పేరుతో కస్టడీ, కేర్, కరెక్షన్ పేరుతో జైళ్ల శాఖ ఖైదీల పట్ల అనేక సేవలు అందిస్తుంది. వివిధ రకాల నేరాలు చేసి జైలు శిక్షకు వచ్చిన వారి పట్ల ఉదార స్వభావంతో అధికారులు వ్యవహరించి వారి మానసిక, శారీరక స్థితిగతులను బేరీజు వేసుకుంటారు. వారి నేరప్రవత్తి మార్చేందుకు జైలు అధికారులు ప్రతి ఒక్కరికీ కౌన్సెలింగ్, గ్రూప్ కౌన్సెలింగ్ వంటివి నిర్వహించి తద్వారా వారిలో మార్పు సాధించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అంతేకాకుండా నిరంతరం యోగా సాధనతో ఖైదీలకు తమ దైనందిక జీవితంలో మార్పులు తీసుకొచ్చేందుకు సైతం జైళ్ల సిబ్బంది చర్యలు తీసుకుంటున్నారు. ఖైదీలతో పాటు, సిబ్బందిని సమన్వయం చేస్తూ జిల్లా సబ్‌జైళ్ల అధికారి, జిల్లా జైల్ సూపరింటెండెంట్ సీహెచ్ ఆర్‌వీ స్వామి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

జిల్లా వ్యాప్తంగా ఇలా..

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జైళ్లశాఖ ఆధ్వర్యంలో ఏలూరు జిల్లా జైలు, భీమవరం స్పెషల్ సబ్‌జైలు, చింతలపూడి సబ్‌జైలు, తణుకు సబ్ జైల్, నరసాపురం సబ్‌జైల్, పోలవరం సబ్‌జైల్‌లు ఉన్నాయి. జైళ్లలో ఖైదీలకు వారి నైపుణ్యాలను ఆధారంగా ప్రస్తుతం మూడు రకాల వేతనాలను అందిస్తున్నారు. పనిలో ఏ నైపుణ్యం లేని వారికి రోజుకు రూ.160, తక్కువ నైపుణ్యం కలిగిన వారికి రూ.180, నైపుణ్యం కలిగిన వారికి రూ.200 ఇస్తున్నారు. పెట్రోల్ బంక్‌లో పని చేసే వారికి రూ.200, ముద్దాయిల అంగీకారంతో కిచెన్, క్లీనింగ్, తదితర పనులు చేసే వారికి రోజుకు రూ.160 రూపాయలు ఇస్తూ వారు జైలు శిక్ష అనంతరం వారి భవిష్యత్‌కు భరోసా ఇచ్చేందుకు జైళ్లశాఖ చర్యలు తీసుకుంటుంది.



ఖైదీలకు యోగా నేర్పిస్తున్న దృశ్యం

ఖైదీల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు



ఏలూరులో ఖైదీల ఆరోగ్య పరిరక్షణ కోసం వాటర్ ప్లాంట్, మహిళా ఖైదీల నైపుణ్యాలను పెంపొదించేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమం ద్వారా బేకరీ ఏర్పాటు చేశాం. జైళ్లశాఖ ఆధ్వర్యంలో పోలవరంలో హెచ్‌పీసీఎల్ పెట్రోల్ బంక్‌ను ఏర్పాటు చేశాం. భీమవరంలో కూడా సీఎస్ఆర్ ఫండ్స్ ద్వారా ఐఓసీఎల్ సహకారంతో ఫీమెల్ ప్రిజనర్ బ్యారెక్స్, కిచెన్, స్టోర్ రూం, డే టాయిలెట్స్, ఇంక్యూబిలేషన్ సెంటర్ కట్టించాం. ఖైదీల రిహాబిలిటేషన్‌లో భాగంగా ఐఓసీఎస్ ద్వారా పెట్రోల్ బంక్ నిర్మాణం పూర్తి చేశాం.

– సీహెచ్ ఆర్‌వీ స్వామి జిల్లా సబ్‌జైళ్ల అధికారి, జిల్లా జైల్ సూపరింటెండెంట్ ఏలూరు జిల్లా

నాకో, ఏపీశాక్స్, రాష్ట్ర జైలు శాఖ సహకారంతోనే..



నాకో, ఏపీ శాక్స్, రాష్ట్ర జైలు శాఖ సహకారంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా 83 జైళ్లల్లో హెచ్‌ఐవీ, టీబీ, సుఖవ్యాధులు, హెపటైటిస్ వ్యాధులపై అవగాహన కల్పిస్తూ క్షేత్ర స్థాయిలో పరీక్షలు చేశాం. వ్యాధి నిర్ధారణైన వ్యక్తులకు అవసరమైన మందులను, ఆరోగ్య సదుపాయాలను అందిస్తున్నాం. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, దిశ, జైళ్ల శాఖ సంయుక్త సహకారంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నాం.

–ఎం రాధిక, లెప్రసొసైటీ సీనియర్ మేనేజర్, విజయవాడ

జైళ్లలో క్షేత్రస్థాయి పరీక్షలు



జైళ్లలో క్షేత్రస్థాయిలో వైద్య పరీక్షలు నిర్వహించేందుకు కృషి చేస్తున్నాం. ప్రతి నెలా ఒక యాక్షన్ ప్లాన్ ప్రకారం ఏ రోజుల్లో ఏఏ సిబ్బందిని ఏ జైలు పంపించాలో? నిర్దిష్టమైన ప్రణాళికతో సేవలు అందిస్తున్నాం. ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి సేవలు అందించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నాం.

– డాక్టర్ నరేంద్రకృష్ణ, డీఎల్‌ఏటీఓ ఏలూరు జిల్లా

ఖైదీలకు నిరంతరాయంగా వైద్య సేవలు



ప్రిజన్ ఇంటర్‌వెన్షన్ కార్యక్రమం అన్ని జైళ్లలో విజయవంతంగా నిర్వర్తిస్తున్నాం. ఖైదీలకు హెచ్‌ఐవీ, టీబీ, సుఖవ్యాధులు, హెపటైటిస్ పరీక్షలు చేయిస్తున్నాం. ప్రిజన్ కోఆర్డినేటర్ వినోద్ కుమార్ పరీక్షలను కో–ఆర్డినేట్ చేస్తూ మాకు నివేదిస్తున్నారు.

–జి.ఆదిలింగం క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్, ఏలూరు, తూర్పు గోదావరి జిల్లాలు

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం



ద్వారకాతిరుమల: శ్రీవారి వైశాఖ మాస దివ్య బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధమైంది. గురువారం ప్రారంభమయ్యే ఈ ఉత్సవాలు ఈనెల 9 వరకు వైభవంగా జరగనున్నాయి. ఆలయాన్ని, పరిసరాలను విద్యుత్ దీప తోరణాలతో శోభాయమానంగా అలంకరించారు. దాంతో ఆలయ రాజగోపురాల సముదాయం, అనివెట్టి మండపం, కొండపైన ఘాట్ రోడ్లు పరిసర ప్రాంతాలు విద్యుత్ దీప కాంతులతో మిరమిట్లు గొలుపుతున్నాయి. ఆలయంలో పుష్పాలంకరణ పనులు బుధవారం రాత్రి ప్రారంభమయ్యాయి. స్వామివారు ఉదయం, రాత్రి వేళల్లో విహరించే వాహనాలను ముస్తాబు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ఆలయ తూర్పురాజగోపుర ప్రాంతంలోని శ్రీహరి కళాతోరణ వేదిక సిద్ధమైంది. గురువారం ఉదయం 9.30 గంటలకు స్వామి, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలను చేయడంతో ఈ ఉత్సవాలు ప్రారంభమవుతాయని ఆలయ ఈఓ ఎన్‌వీఎస్ఎన్ మూర్తి తెలిపారు.

శ్రీకృష్ణా సుజుకీలో దసరా ఆఫర్లు



కొనుగోలుదారులతో కళకళలాడుతున్న ఏలూరులోని సుజుకీ షోరూమ్

ఏలూరు టౌన్: ఏలూరులోని శ్రీకృష్ణా సుజుకీ షోరూమ్‌లో దసరా వేడుకల నేపథ్యంలో సందడి వాతావరణం నెలకొంది. ఒకవైపు జీఎస్టీ తగ్గింపు, మరోవైపు శ్రీకృష్ణా సుజుకీ యాజమాన్యం నారా శేషు కొనుగోళ్లపై ఆఫర్లు ప్రకటించటంతో కొనుగోలుదారులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం సుజుకీ వాహనం కొనుగోళ్లపై సుమారు రూ.15వేల వరకూ జీఎస్టీ ఆదా అవుతుందని నిర్వాహకులు చెబుతున్నారు. వీటితోపాటు క్యాష్ బ్యాక్ ఆఫర్లు కొనుగోలుదార్లను ఆకర్షిస్తున్నాయి. ప్రతి సుజుకీ యాక్సెస్ కొనుగోలుపై రూ.3వేలు, అవినీస్ కొనుగోలుపై రూ.5వేలు క్యాష్‌బ్యాక్ ఆఫర్ వర్తిస్తుందని షోరూమ్ ప్రతినిధులు చెబుతున్నారు ప్రతి మోటారు సైకిల్ కొనుగోలుపై ఏకంగా రూ.20 వేల క్యాష్‌బ్యాక్ ఇస్తుండగా, డౌన్‌పేమెంట్ సైతం కేవలం రూ.5999 మాత్రమే ఉందని యజమాని నారా శేషు తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ఏలూరు, భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, పాలకొల్లు, కొవ్వూరులోని తమ షోరూమ్స్‌లో ఆఫర్లు కొనసాగుతున్నాయని ఆయన స్పష్టం చేశారు.

సినిమా థియేటర్‌లో ఘర్షణ.. నలుగురి బైండోవర్

కైకలూరు: స్థానిక మాగంటి థియేటర్‌లో ఈ నెల 30న థియేటర్ సిబ్బందిపై దాడి చేసిన ఘటనలో నలుగురిపై కేసు నమోదు చేసి, తహసీల్దార్ వద్ద బైండోవర్ చేశామని కైకలూరు టౌన్ ఎస్సై డి.వెంకట్‌కుమార్ బుధవారం విలేకరులకు తెలిపారు. వివరాల ప్రకారం కలిదిండి మండలం పడమటిపాలెంకు చెందిన పాము సూర్యకుమార్(23), గంగుల ధన్‌రాజ్(29), కలిదిండి హేమంత్‌కుమార్(30), కరేటి సాయికుమార్(23)లు మద్యం తాగి ప్రేక్షకులతో గొడవకు దిగారని పేర్కొన్నారు. టిక్కెట్లు డబ్బులు వాపసు ఇస్తామని బయటకు వెళ్లాలని థియేటర్ మేనేజర్ గణేష్, సిబ్బంది సుంకర వెంకటేశ్వరరావులు చెప్పారు. దీంతో అక్కడ శుభ్రం చేసే కర్రతో వీరిపై నలుగురు దాడి చేశారు. నిందితులను కైకలూరు తహసీల్దారు ముందు హాజరుపర్చగా ఏడాదికి ఒక్కొక్కరికీ రూ.5 లక్షలు బైండవర్ విధించినట్లు ఎస్సై చెప్పారు. యువకులకు కౌన్సెలింగ్ ఇచ్చి స్టేషన్ బెయిల్‌పై పంపించామన్నారు.

వరకట్న వేధింపులపై కేసు

ముదినేపల్లి రూరల్: అదనపు కట్నం కోసం వేధిస్తున్న భర్త, అత్తలపై వివాహిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం మండలంలోని పెయ్యేరు శివారు అప్పారావుపేటకు చెందిన డి.ప్రియాంకకు పెడన మండలం కోటవానిపాలెం గ్రామానికి చెందిన పరసా శ్రీకాంత్‌తో 2018లో వివాహం జరిగింది. వివాహ సమయంలో ఇచ్చిన లాంఛనాలతో పాటు అనంతరం మరికొంత నగదు ముట్టజెప్పారు. అయినప్పటికీ భర్త శ్రీకాంత్‌తో పాటు అత్త శేషమ్మ అధిక కట్నం తేవాలని తరచూ శారీరకంగా, మానసికంగా వేధిస్తూ కాపురానికి తీసుకువెళ్లడం లేదు. దీంతో బాధితురాలు ప్రియాంక పోలీసులను ఆశ్రయించింది.

యువకుడి అదృశ్యం కేసులో వీడని మిస్టరీ



చించినాడ వద్ద గాలిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ బృందాలు

తణుకు అర్బన్ : తణుకులో అదృశ్యమైన తాడేపల్లిగూడేనికి చెందిన మడుగుల సురేష్ (25) కేసులో నెలకొన్న మిస్టరీ ఇంకా వీడలేదు. అదృశ్యమై పది రోజులు గడిచిపోవడం, తణుకు గోస్తనీ కాలువతోపాటు చించినాడ గోదావరిలో సైతం ఎన్ని రకాలుగా ప్రయత్నాలు చేసినా ఎలాంటి ఆనవాళ్లు దొరక్కపోవడంతో పోలీసులు తలలుపట్టుకుంటున్నారు. ఈ కేసులో బాధిత వర్గాల నుంచి ఆరోపణలు ఎదుర్కొంటున్న న్యాయవాది తిర్రే సత్యనారాయణరాజుతో పాటు పట్టణానికి చెందిన మరో నలుగురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నించినప్పటికీ సురేష్ జాడ తెలుసుకోలేకపోవడం గమనార్హం. సురేష్‌ది హత్యగా నిర్ధారించుకుని విచారణ చేస్తున్నా నిందితులు మృతదేహాన్ని మాయం చేసిన తీరు పోలీసులను గందరగోళానికి గురి చేస్తుంది. బుధవారం చించినాడ గోదావరిలో ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు సురేష్ జాడ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అయినప్పటికీ ఎలాంటి సాక్ష్యాలు బయటపడకపోడంతో గురువారం మళ్లీ తిరిగి గాలింపు చేపట్టనున్నట్లు తెలుస్తోంది. ఈనెల 23న సురేష్ తన సన్నిహితురాలు శిరీష ఇంటికి వచ్చిన విషయాన్ని స్థానికంగా ఉన్న నిందితుడి అనుచరుడు ఇచ్చిన సమాచారంతో రెక్కీ నిర్వహించి కిడ్నాప్ చేశారని, ఈ క్రమంలో చేసిన దాడిలో సురేష్‌కు తీవ్రగాయాలు కాగా కారులో తరలించి చించినాడలోని గోదావరిలో పారవేసినట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

భీమవరం: పట్టణంలో బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారని టూటౌన్ ఎస్సై ఫజుల్ రహమాన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని లంకపేటకు చెందిన బొబ్బనపల్లి హరీష్‌బాబు తన స్నేహితుడు కొరాడ లక్ష్మీనారాయణతో కలిసి దుర్గాపురం నుంచి టీ తాగడానికి మోటారు సైకిల్‌పై వస్తుండగా వేగంగా వస్తున్న కారు రోడ్డుపై ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. అనంతరం ఆగకుండా హరీష్‌బాబు ప్రయాణిస్తున్న మోటారుసైకిల్‌ను ఢీకొట్టింది. దీంతో మోటారుసైకిల్‌పై ఉన్న ఇద్దరు రోడ్డుపైపడి గాయపడ్డారు. వీరిని స్థానికులు చికిత్స కోసం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రహమాన్ పేర్కొన్నారు.

గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా

గ్రామాల్లో మెడికల్ క్యాంపులు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ఉప్పరగూడెం, కొమ్ముగూడెం గ్రామాల్లో బుధవారం స్వస్త్ నారీ – సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మహిళలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పరగూడెంలో 164మందికి, కొమ్ముగూడెంలో 220మంది రోగులకు పరీక్షలు చేశారు. ఎంఎల్‌హెచ్‌పీలు వి.రూత్, ఎం. మౌనిక, రామతారకం, ఏఎన్ఎం టి.విజయ, మహంకాళి, కే.ధనలక్ష్మి, వీరపాప, ఆశాలు ఎం.చంద్రకాంతం, డి.రామతులసి, ఎ. వెంకటలక్ష్మి, కే.ప్రశాంతి, అంగన్‌వాడీ సిబ్బంది ఎం.రజీనా బీబీ, కనకలత, సీహెచ్.శాంతికుమారి పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో అన్ని వర్గాలకూ లబ్ధి

పెంటపాడు: జీఎస్టీ తగ్గింపుతో అన్ని వర్గాల ప్రజలకూ లబ్ధి చేకూరుతుందని ప్రతిపాడు గ్రామ కార్యదర్శి జవ్వాది నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం జీఎస్టీ సూపర్ సేవింగ్‌పై ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. చెరుకూరి సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పండగ వేళ.. ప్రయాణ కష్టాలు

- స్వస్థలాలకు వచ్చేందుకు ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు
- కిక్కిరిసిపోతున్న స్త్రీ శక్తి ఆర్టీసీ బస్సులు
- ఇబ్బందుల్లో ప్రయాణికులు
- బస్సులు కొరత తీరేది ఎప్పుడో?


కాంప్లెక్స్ వద్ద రద్దీగా బస్సులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): దసరా పండుగ దగ్గర పడుతోంది. పండుగ అనగానే ఎక్కడెక్కడికో వెళ్లిన వారంతా సొంతూళ్లకు పయనమవుతారు. స్త్రీ శక్తి అంటూ ప్రభుత్వం మహిళలకు బస్సు ఫ్రీ ఇవ్వడంతో నేడు ఆర్టీసీ బస్సులలో ప్రయాణం కష్టసాధ్యంగా మారింది. నేడు బస్సులలో ప్రయాణించేందుకు మహిళలు ఎక్కువగా ఆసక్తి చూపిస్తున్నారు. వారి ఆసక్తి కారణంగా తెల్లవారుజాము నుంచే బస్సు కాంప్లెక్స్‌లకు మహిళలు క్యూ కడుతున్నారు. బస్సు రాగానే ఆ బస్సులోకి ఎక్కేందుకు పోటీపడుతున్నారు. దీంతో ఆయా రూట్లలో బస్సులు కిక్కిరిసిపోతున్నాయి. మహిళలు, వృద్ధులు పిల్లలతో బస్సులు కిటకిటలాడుతున్నాయి. గొడవలు జరుగుతున్నాయి. బస్సుల కొరత ప్రధాన సమస్యగా మారింది.

కష్టసాధ్యంగా పురుషుల ప్రయాణం

ఒకవైపు బస్సుల కొరత మరోవైపు కిక్కిరిసిన బస్సుల కారణంగా పురుషులు ప్రయాణించేందుకు ప్రతి రోజు వారు నానా అవస్థలు పడుతున్నారు. పలు మార్గాలలో బస్సులు తక్కువకావడం.

మరోవైపు ఆ మార్గాలలో ప్రయాణించే ప్రయాణీకులు, ముఖ్యంగా మహిళలశాతం ఎక్కువగాఉంది. దీంతో బస్సు లు హౌస్‌ఫుల్‌గా మారుతున్నాయి. కొన్ని స్టాప్‌లలో బస్సులు ఆగడం లే దు. 55నుంచి 60 సీటర్స్ ఉండే బస్సు ల్లో అదనంగా మరో 50 మంది వరకు ఎక్కించడంతో ప్రయాణం కష్టసాధ్యంగా మారుతుంది. 100కు పైగానే బస్సు ఎక్కుతూ, దిగుతున్నారు. బస్సు ప్రయాణించే సమయంలో ఫుట్ పాత్ వద్దే చాలా మంది వేలాడుతూ ప్రయాణం సాగిస్తున్నారు. బస్సు ప్రారంభ భాగంలోనే ఎక్కువ మంది ప్రయాణీకులు నిల్చుంటున్నారు. బస్సు, మధ్య భాగానికి, వెనుక భాగానికి వెళ్లమన్నప్పటికీ వారు కదలడం లేదు. డ్రైవర్, కండక్టర్‌లు గొడవలు పడి ఏదో రకంగా ప్రయాణీకులను వెనక భాగానికి పంపినా, తిరిగి వారు దిగేందుకు అష్టకష్టాలు పడాల్సి వస్తుంది. ఒక వైపు లగేజీ, మరో వైపు అధిక సంఖ్యలో ప్రయాణీకులతో ఇబ్బందులు తప్పడం లేదు. రోజు ఆర్టీసీ బస్సులలో ప్రయాణం నానా అవస్థలతో జరుగుతుంది.

పని ఉన్నా లేకపోయినా బస్సులు ఎక్కుతున్నారు

గతంలో ఏదైన పని ఉంటేనే మహిళలు ప్రయాణాలు సాగించేవారు. పని ఉన్నవారు, లేని వారు బస్సులు ఎక్కుతున్నారు. మహిళలతో పాటు వృద్ధ మహిళలు, చంటి పిల్లలను కూడా బస్సులు ఎక్కడంతో బస్సులలో కుస్తీ పట్లు పట్టే వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతుంది. గొడవలు లేకుండా బస్సు ప్రయాణం ఉండటం లేదు.

ఆర్టీసీ బస్సులు కాంప్లెక్స్ పాయింట్ వద్ద నిలుపుదల చేయడం లేదు

ఆర్టీసీ బస్సులు కాంప్లెక్స్ పాయింట్ వద్దకు వచ్చే సరి కే ప్రయాణీకులు బస్సుఎక్కడంతో పాయింట్‌వద్దకు బస్సు రావడంలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్నిప్రాంతాలలో ఆర్టీసీడ్రైవర్, కండక్టర్‌కు, ప్రయా ణీకులకు మధ్య గొడవలు కూడా జరుగుతున్నాయి.

75 శాతంపైగా మహిళలు

కొన్ని ప్రధాన రూట్లలో బస్సులలో 75 శాతంకు పైగా మహిళలు కన్పిస్తున్నారు. దీంతో అత్యవసర పనిమీద వెళ్లేవారికి ఇబ్బందులు అంతాఇంతా కాదు. నేడు బస్సు ప్రయాణం కష్టసాధ్యంగా మారింది. అదే విధంగా వివిధ స్టాప్‌లవద్ద ఆపకుండా బస్సులు వెళ్లిపోతున్నాయి. వెంకి పెళ్లి సుబ్బు చావుకు వచ్చింది అన్న చందంగా బస్సు స్టాప్‌లలో వేచి ఉన్నారు. బస్సులు దొరకక ఇబ్బందులు పడుతున్నారు. కేవలం బస్సు కాంప్లెక్స్‌కు వెళ్లిన వారికే బస్సులు ఎక్కే అవకాశం ఉంటుంది. కొన్ని మార్గాలలో అయితే ఆ సౌకర్యం కూడా కష్టసాధ్యంగా ఉంది.

ఇబ్బందులు పడుతున్న కండెక్టర్లు

ఇది ఇలా ఉంటే బస్సులు రద్దీగా ఉండటంతో ఊరి పొలిమేరలలో బస్సులను నిలిపి కండెక్టర్లు టిక్కెట్లు కొడుతున్నారు. కెపాసిటీకి మించి ప్రయాణీకులు ఉండటంతో అందరికి టిక్కెట్ కొట్టే సమయం ఎక్కువ అవుతుంది. ఉచితంగా ప్రయాణం చేసేవారికి టిక్కెట్ కొట్టాలన్న నిబంధన ఉండటం వల్ల ఈ పరిస్థితి తలెత్తుతుంది. దీంతో బస్సు ప్రయాణాలు ఆలస్యమవుతున్నాయి. రాకపోకలు ఆలస్యం కావడంతో బస్సులు ఆలస్యంగా నడుస్తున్నాయి. ఉచిత బస్సుల వల్లే ఈ పరిస్థితులు తలెత్తుతున్నాయిని పలువురు మగ ప్రయాణీకులు వాపోతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, బస్సులు ఎక్కేందుకు చాలా ఇబ్బందులు పడుతున్నారు. కొంత మంది బస్సు ఎక్కలేక ఆగిపోవాల్సి వస్తుంది.

ఆర్టీసీ కాంప్లెక్స్‌లలో..

ఉచిత బస్సు పుణ్యం పేరుతో బస్సులు ఎక్కేందుకు ప్రయాణీకులు ఒకొరినొకరు గెంటుకోవడం కానవస్తుంది. కిటికీలలో నుంచి సీట్ల కోసం కర్చీఫ్‌లు వేసి ఎగపెడుతున్నారు. బస్సుల వైపుకు దూసుకువెళ్లతున్నారు. బస్సులలోకి వెళ్లిన తరువాత రద్దీ ఎక్కువై సీట్లకోసం వివాదం, ఘర్షణలు షరా మామూలుగా మారుతున్నాయి. బస్సులు కిక్కిరిసి ఉండటంతో ప్రయాణీకులను ఎక్కించుకోకుండా కొందరు డ్రైవర్లు ముందుకు వెళ్లిపోతున్నారు.

బస్సుల సంఖ్య పెంచాలి



బస్సులు సంఖ్య పెంచాలి. లేని పక్షంలో ఆర్టీసీలో ప్రయాణం కష్టసాధ్యం అవుతుంది. రోజు రద్దీతో బస్సులు ప్రయాణం చేస్తున్నారు. మహిళలు ఎక్కువ మంది ప్రయాణం చేయడం వల్ల మగ వారు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర సమయాలలో అనేక ఇబ్బందులు పడుతున్నాం

– ఎస్.రవి కిషోర్, తాడేపల్లిగూడెం

నేడు గాంధీజీ విగ్రహావిష్కరణ

తణుకు అర్బన్: స్థానిక బ్యాంక్ కాలనీలోని స్వాతంత్ర్య సమరయోధుల పార్కులో గురువారం మహాత్మాగాంధీజీ విగ్రహావిష్కరణ నిర్వహిస్తున్నట్లు సామాజిక విశ్లేషకులు డీవీఎస్ వర్మ తెలిపారు. గాంధీ మహాత్ముడి జయంతి రోజు పురస్కరించుకుని ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకావిష్కరణ చేస్తారని, విగ్రహ దాత స్వాతంత్ర్య సమరయోధులు సంకు అప్పారావు కుమార్తె సంకు మనోరమ విగ్రహావిష్కరణ చేస్తారని తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత


తణుకులో విద్యార్థినులకు ఆర్థికసాయం అందిస్తున్న మానవత సంస్థ ప్రతినిధులు

తణుకు అర్బన్: మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో కళాశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థినులకు చదువు నిమిత్తం ఆర్థిక సాయం అందచేసినట్లు సంస్థ అధ్యక్షుడు కడించర్ల రాజరాజేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం స్థానిక గమిని ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణానికి చెందిన దాత చిట్టూరి సుజాత సౌజన్యంతో ఉమెన్స్ కళాశాలలో బీకామ్ కంప్యూటర్స్ చదువుతున్న విద్యార్థిని లొల్ల రేణుకకు రూ. 10వేలు, ఇంపల్స్ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని మేతికిమిల్లి భార్గవికి రూ. 10వేలు ఆర్థికసాయం అందచేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా శాంతి ర్యాలీ చైర్మన్ గమిని రాంబాబు, నెక్కంటి నాగేశ్వరరావు, ఆలపాటి సుబ్బారావు, డాక్టర్ దాట్ల సత్యనారాయణ రాజు, సీహెచ్ కృష్ణప్రసాద్, కేవీ రమణమూర్తి, గోకవరపు కాశీవిశ్వనాధం, టి. రామకృష్ణ, గోపాలకృష్ణ, ఒబిలిశెట్టి హరనాథ్, కొల్లేపర సత్యనారాయణ, మానవత సభ్యులు పాల్గొన్నారు.

వృద్ధులకు ఆటల పోటీలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): వృద్ధులు జాతి సంపద అని, వారి సంరక్షణ కుటుంబ సభ్యులకే కాక సమాజానికి ఎంతో అవసరమని లయన్స్‌క్లబ్ అడ్మినస్ట్రేటిర్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ డైమండ్స్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ ఆవరణలో ఘనంగా సీనియర్ సిటిజన్స్ డే ను నిర్వహించారు. వారికి ఆటల పోటీలు సైకిలింగ్, నడక, షెటిల్ పోటీలు జరిగాయి. రీజియన్ చైర్మన్ సుంకర శ్రీనివాస్, జోన్ చైర్‌పర్సన్ షేక్ బాజీలు పోటీలను ప్రారంభించారు. వాకర్స్‌క్లబ్ సెక్రటరీ మానేపల్లి కిరణ్ కుమార్, గాజుల మురళీ కృష్ణ, కంచర్ల లక్ష్మినరసింహంలు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. విజేతలకు సత్కారం, బహుమతులు అందజేశారు. కె.సాయి సత్యనారాయణ రాజు, అపర్ణ ప్రసాద్, యర్రా ఆంజనేయస్వామి, జామి సత్యనారాయణ, రెడ్డి సత్యనారాయణ, యెలిశెట్టి ప్రసాద్, బడుగు చంద్రశేఖర్, రాజా త్రినాథ్ పాల్గొన్నారు.

స్టాఫ్ నర్సులతోనే సాధారణ వైద్యం


మాధవరం పీహెచ్‌సీలో రోగి వివరాలు అడిగి తెలుసుకుంటున్న స్టాఫ్ నర్స్

తాడేపల్లిగూడెం రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యులు మంగళవారం నుంచి సమ్మె బాట పట్టారు. దీంతో తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెం, మాధవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని జ్వరాలు, బీపీ, సుగర్, కుక్క కాటు వంటి సాధారణ రోగులకు స్టాఫ్ నర్సులే వైద్య సేవలందించారు. వెంకట్రామన్నగూడెం పీహెచ్‌సీలో 70మందికి, మాధవరం పీహెచ్‌సీలో 50మందికి స్టాఫ్ నర్సులు వైద్య సేవలందించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. మాధవరం పీహెచ్‌సీకి డీఎంహెచ్‌ఓ ఆదేశాల మేరకు ఏరియా ఆసుపత్రి నుంచి క్రాంతిని, వెంకట్రామన్నగూడెంకు రూపేష్‌లను నియమించారు. బుధవారం సదరు వైద్యులు అందుబాటులోకి రాకపోవడంతో స్టాఫ్ నర్సులే వైద్య సేవలందించారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ


వృద్ధులను సన్మానిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా బుధవారం సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో వృద్ధాశ్రమంలో పేదలైన వృద్ధులకు దుప్పట్లు, పండ్లు, అన్న దానం చేశారు. అఖిల భారత సీనియర్ సిటిజన్ సంక్షేమ సంఘం జాయింట్ సెక్రటరీ వీకే వీరారావు, జిల్లా అధ్యక్షుడు ఎ.ఎస్.ఎస్ సత్యనారాయణలు మాట్లాడుతూ వృద్ధులకు రాజ్యాంగపరంగా కల్పించిన హక్కులు, రక్షణ, వృద్ధులకు కుటుంబ సభ్యులు వల్ల, ఇతరుల వల్ల ఇబ్బందులు కలిగినప్పుడు చట్టపరంగా అందే సహాయం తదితర అంశాలను ప్రస్తావించారు. తాలూకా యూనిట్ అధ్యక్షుడు కె.బాలకృష్ణ, కార్యదర్శి ఎ.జనార్ధనరావు, బి.హరికుమార్, వైవీఎస్ మూర్తి, వంగపండు రామ్మోహన్‌రావు, ఎండీ ముస్తాఫా, ప్రవీణ్ ప్రకాష్, చక్రధరరావు, సీహెచ్ సూర్యప్రకాశ్, ఏఆర్‌కే మూర్తి, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి


మాట్లాడుతున్న పోలిరాతి ఆదినారాయణ

తాడేపల్లిగూడెం (టీఓసీ) : భవన నిర్మాణ కార్మికులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చాలని, కార్మికుల సంక్షేమ బోర్డులో పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లను వెంటనే పరిష్కరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోలిరాతి ఆదినారాయణ అన్నారు. పట్టణంలో బుధవారం యూనియన్ నెలవారి సమావేశం జరిగింది. ఆదినారాయణ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పోరాడి సాధించుకున్న భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పూర్తిస్థాయిలో అమలు చేయలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీను తప్పనిసరిగా నెరవేర్చాలని కోరారు. కార్మికులకు భరోసాగా నిలవాలన్నారు. భవన నిర్మాణ కార్మికులకు ప్రస్తుత కూటమి ప్రభుత్వం అన్యాయం చేయకూడదన్నారు. ప్రజా ప్రతినిధులు చుట్టూ ప్రదక్షిణాలు చేసిన ఫలితం లేదని వాపోయారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి అత్తిలి బాబి, కోశాధికారి కోడే సాయి బాలాజీ, జిల్లా జాయింట్ సెక్రటరీ మెండెం జేమ్స్, సభ్యులు పాలూరి రాంబాబు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మేధోవైకల్యంపై సాయి స్వరూపకు డాక్టరేట్

పెంటపాడు: మేధోవైకల్యం, మానసిక వికలాంగత అనే అంశాలపై తీవ్ర పరిశోధన చేసినందుకుగాను పెంటపాడు ప్రభుత్వ బేసిక్‌స్కూలు ప్రత్యేక ఉపాధ్యాయిని సాయి స్వరూపకు డాక్టరేట్ దక్కింది. గతనెల 30న హైదరాబాద్‌లోని బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయ 26వ స్నాతకోత్సవంలో ఆమె తెలంగాణా రాష్ట్ర గవర్నర్ విష్ణుదేవ్‌వర్మ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నారు. స్వరూప మనో వైకల్యం కలిగిన విద్యార్థుల దైనందిన చర్యలను గమనించి వారిపై ప్రత్యేక అధ్యయనం చేశారు.

డ్రైయినేజీ నిర్మాణం చేయాలి


వేల్పూరులో డ్రైయినేజీ నిర్మాణం చేయాలని కోరుతూ వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

తణుకు అర్బన్: తణుకు మండలం వేల్పూరు గ్రామం 10వ వార్డులోని సాలిపేటలో శిథిలావస్థకు చేరిన డ్రైయినేజీని పునః నిర్మాణం చేపట్టాలని సీపీఎం వేల్పూరు గ్రామ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు అధికారులకు విజ్ఞప్తి చేశారు. సీపీఎం వేల్పూరు గ్రామ కమిటీ ఆధ్వర్యంలో డ్రైయినేజీ నిర్మాణం చేపట్టాలని కోరుతూ ఇంటింటికి తిరిగి సంతకాల సేకరణ చేశారు. అనంతరం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలోని బిల్లు కలెక్టర్ కోలా శ్రీనివాస్‌కు ప్రజల నుంచి సేకరించిన సంతకాలతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వీరభద్రం మాట్లాడుతూ డ్రైయినేజీలో ప్రజలు వాడిన వాడకం నీరు పారుదల లేక మురుగునీరు నిల్వ ఉండిపోయి తీవ్రమైన దుర్వాసన వస్తుందని స్పష్టం చేశారు. దీంతో దోమల బెడద అధికంగా ఉండటంతో విష జ్వరాలు, మలేరియా వంటి రోగాలు వ్యాపించి ఆ ప్రాంత ప్రజలు తీవ్రమైన అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం నెలకొందని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ శాఖ కార్యదర్శి వాసా వెంకటేశ్వరరావు, శలాకోటి నరసింహమూర్తి, అందే మల్లేశ్వరరావు, తాడిశెట్టి సత్యనారాయణ, విశ్వనాథం సుబ్బారావు, వాసా పోసియ్య తదితరులు పాల్గొన్నారు.

రక్తనిధిని సద్వినియోగం చేసుకోవాలి

తాడేపల్లిగూడెం: రక్తనిధిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పిలుపునిచ్చారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన బ్లడ్‌బ్యాంక్‌ను బుధవారం ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ అనుకోని ప్రమాదాలు జరిగితే ప్రాణాలను కాపాడేందుకు రక్తం ఎంతో విలువైందన్నారు. ఆసుపత్రికి వేలాదిమంది పేదలు ప్రతిరోజు వైద్యం నిమిత్తం వస్తారని, అవసరమైన వారికి రక్తాన్ని ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, జేసీ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డీఎంహెచ్‌ఓ గీతాబాయి, డీసీహెచ్ఎస్. సూర్యనారాయణ, ఆసుపత్రి సూపరింటెండెంటు రవిపాల్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

జననీ.. అభయ రూపిణీ


శ్రీ మహిషాసుర మర్దనిగా బలుసులమ్మ


శ్రీ మహిషాసుర మర్దనిగా సర్వమంగళమ్మ


శ్రీ మహిషాసుర మర్దనిగా మహంకాళమ్మ


శ్రీ మహంకాళి అమ్మవారిగా వాసవి మాత


ప్రత్తిపాడు కాగులంపాడు రోడ్డులో దుర్గమ్మ కలశాభిషేకం చేసేందుకు తరలివెళ్తున్న మహిళలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా అమ్మవారు బుధవారం మహిషాసుర మర్దినీ అలంకరణలో దర్శనమిచ్చారు. పట్టణంలో దేవి నవరాత్రి మహోత్సవాలు సందర్భంగా 10వరోజైన బుధవారం బలుసులమ్మ అమ్మవారిని శ్రీ మహిషాసుర మర్దినీగా, వాసవి కన్యక పరమేశ్వరీని మహంకాళి అమ్మవారిగా, శంకరమఠంలోని సర్వమంగళమ్మవారిని మహిషాసుర మర్దినీగా, మహంకాళమ్మ అమ్మవారిని మహిషాసురమర్దినీగా, విశ్వదుర్గేశ్వరి అమ్మవారిని హరితాదేవిగా విశేష అలంకరణలు చేశారు. భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

దుర్గమ్మకు విశేష పూజలు

పెంటపాడు: దేవీ శరన్నవరాత్రులు 10వ రోజైన బుధవారం ప్రత్తిపాడు కాగులంపాడు రోడ్డులోని అమ్మవారు బుధవారం మహిషాసుర మర్దిగా అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా 1000మందికి పైగా మహిళలతో కలశాలతో భారీ ఊరేగింపు నిర్వహించి అమ్మవారికి ప్రత్యేకంగా అభిషేకించారు. ఈ కార్యక్రమంలో సైపురెడ్డి రాంబాబు, ఆలయ కమిటీ అధ్యక్షుడు వీర్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం అన్నసమారాధన చేశారు.